# సీత

రచన :
శ్రీ పెరుమాళ్

కథానిక

ఆ వేళ సాయింత్రం రామారావు నీటుగా తయారై నీళ్ళగది దగ్గర తచ్చాడుతూ వున్నాడు. ఇంట్లో వారంతా పైవీధిలోని చుట్టాలింటికి వెళ్ళటం, తాను నిర్వర్తింపదలచిన కార్యసిద్ధికి భగవదానుగ్రహంగా తలంచాడు. అంతట్లోనే అన్నిపనులు అరికట్టుకొని పెరట్లోనుండి వస్తూన్న పనిమనిషి సీత రాకను చూచి ఇంట్లోకిపోయే ద్వారానికి కొంచం అడ్డుగా నిలుచు న్నాడు. సీత మామూలుగా తలనుదించుకొని ద్వారానికి దగ్గరగావస్తూ, అతన్ని సమీపించగానే "అదేం బాబు! ఇలా యిక్కడ నిలుచున్నారు? అమ్మ వాళ్ళంతా పిన్నిగారింటికి వెళ్ళారనా?" అనేసరికి రామార్రావే మొదట కంగారుపడినా, వెంటనే సర్దు కొని, సీత యౌవనగుణరూప వినయాలకు తోడుగ చక్కని మాటల చమత్కృతి గల్గియుందని గ్రహించాడు.

"అదేంబాబు! అలా కంగారు పడతారూ? కొంచం తప్పుకోండి అవలకు పోతా" అని మళ్లీ అంది.

"అ!...ఆఁ!...అలాగే, నీవన్నట్లు యింట్లో నువ్వు నేను తప్పిస్తే యింకెవ్వరులేరు. మరేం భయంలేదులే!" అని తొందరగా అనేసాడు.

"కొంపతీసి వీధి గడియకూడ లోపలకు వేసారా, ఏం?" అని చమత్కారంగా అడిగింది.

"బాగా గ్రహించావ్ సీతా! ఇంత గ్రహింపుశక్తి వుండికూడ నన్ను బాధపెట్టడం బాగులేదనుకుంటాను."

"ఎవరూలేని సమయంలో వీధిగడియవేసి నాతో మీరిలా మాట్లాడ్డం మరీ బాగులేదనుకుంటా నేను" అని పెంకి జవాబు చెప్పేసరికి రామారావు ఆమె ధోరణి ఏమీ అర్థం చేసుకోలేకపోయి, "అదికాదు సీత! నీకు మంచి భావి వుందని చెబుతున్నాను" అన్నాడు.

"అంటే మీ వుద్దేశం నుయ్యా? భవిష్యత్తా?"

"అబ్బ! ఇంతటి జ్ఞానసంపన్నురాలవు మూర్ఖ పురుషుల్లాగు మా యింట్లో పనిమనిషిగా ఎలా చేరావో నాకు చాల ఆశ్చర్యంగా వుంది!"

"ఆశ్చర్యానికేముందిలెండి! ధనవంతులంతా దరిద్రుల కిచ్చే దోహదం యిదేగా! నేను దరిద్రురాలను— అంతే, నా విద్యావికాసాలతో వానికేంపని" అని అంది.

"అరరే...ఎంతపని చేసావ్...పూర్తిగా చదువుకుంటే ఏదైనా ఉద్యోగమైనా చేద్దువు. మాటవరసకు ఎంతవరకు చదువుకున్నావేమిటి?"

"నా చదువుకేంలెండి బాబు! ఏదో ఐదోక్లాసుదాక చదివాను."

"అయితే కనీసం స్కూలుఫైనలుదాక చదివితే బాగుండేది. ఏదైనా వుద్యోగం......"

"నిజమే! చదవవలసిందే! కాని ఆయిదో క్లాసు చదివించడానికే మా అమ్మ అష్టకష్టాలు పడింది. ఒక పూట తింటూ, ఒకపూట లేనట్టు ఎలాగో అప్పటివరకు గడప గలిగాము. ఆ తరువాత అదికూడ కష్టమయింది. దాంతో నా చదువుకు స్వస్తి చెప్పి, వాళ్లను వీళ్లను అడిగి పుస్తకాలు చదువుకునేదాన్ని. ఇంక మా అమ్మ ముసల్దికాగానే మా వృత్తిలో నేను చేరక తప్పింది కాదు. మీరే ఆలోచించండి! ఇంతకీ ఈ దేశంలో పేదవార్కి తావులేదు బాబు! భోగాలు, చదువులు, సంధ్యలు అన్నీకూడ ధనవంతులకే" అని వుద్రేకంతో సీత చెబుతూంటే రామారావు స్తబ్ధుడై, "అవును సీత, నీవు చెప్పేవన్నీ నిజమే! కాని నీ ముఖం చూడగానే

నాకేదో నూతనత్వం కనబడింది. దాంతో మంచి భవిష్యత్తు ఉందని చెప్పగలిగాను" అన్నాడు.

"దానికేంలెండి! మనకిష్టమైన వస్తువును చూస్తుంటే మనకలానే అనిపిస్తుంది!"

"అలాకాదు సీత! నిన్ను నేను ప్రేమిస్తున్నానని చెప్పటమన్నమాట!"

"చాల తప్పు బాబు! కలలోకూడ జరగనివిషయాల్లో దూరుతున్నారన్నమాట!"

"వట్టిగా ప్రేమించడమే కాదు సుమా! పెళ్ళికూడ చేసుకుంటానని చెప్తున్నాను."

"అమ్మో! వద్దుబాబూ! మీరెక్కడ మేమెక్కడ అంతంత ఆశలు మావంటి పేదలకు అర్హతలేదని చెప్పానుగా!"

"నీవలాచెప్పటం సహజమే! దానికేంలే. కాని అన్నీ గ్రహించే నీకా అర్హత వుందని దృఢవిశ్వాసంతోనే నిన్ను పెళ్ళిచేసుకుంటానని చెబుతున్నాను" అని రామారావు సీత చేయిపట్టుకొని దగ్గరకు తీసుకొనబోయాడు. కాని సీత వెనక్కుతగ్గి, "బాబు మీరుచాల తొందరపడుతున్నారని తెలుసుకోండి. మీవుద్దేశం గ్రహించలేదని అనుకోకండి. మీకు నామీద ఎంత ప్రేమవుందో నాకుతెలుసు. మీరువచ్చిన వారంరోజుల నుండి మీరు ఎంత అవస్థపడుతున్నారో, ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తున్నారో అన్నీ కనిపెడుతునే వున్నాను. కాని యిప్పుడున్న పట్టుదల, ఉత్సాహం మీలో ఆతరువాత వుండకపోవచ్చు. అవికాకుండ మీపైని మీ తల్లిదండ్రులు, మీకు కావలసినవాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళు యిటువంటివి హర్షించరు. వాళ్ళ అభ్యంతరం మీ ఊహాలన్నిటినీ పటాపంచలు జేయగలదని నమ్మండి. మీరు చదువుకుంటున్నవారు కాబట్టి సంఘాన్ని బాగుచేద్దామని మీకు సహజంగా వుద్దేశాలు వుంటాయి. కాని మీపెద్దలు ఏమాత్రం కూడ వాటిని సాగనీయరు. అందుచేత మీప్రయత్నం విరమించుకుంటే చాల మంచిదేమో!......అలా అని మీమీద నాకేమి ద్వేషంగాని, అయిష్టంగాని లేదు సుమండీ? అని చెబుతూంటె, రామారావు "హమ్మ" అని నిట్టూర్చి, "అయితే యింకేంకావాలి సీత? ఇప్పుడు నామనస్సంతా తేలికయింది. ఇంక మనకు అడ్డుచెప్పేవారు లేరనుకో!" అని ఆవేశంతో సీతను దగ్గరకు తీసుకుంటుంటే, సీత అతని చాతీకి తన ఎడమచేతిని అడ్డుపెట్టి, "ఆగండి! మీరీ వుద్రేకంతో మీకార్యం మీరు నిర్వర్తించుకొని, మీ ఆనందాన్నేదో మూటకట్టుకుపోతారు, కాని అది మా మానప్రాణాలతో కూడుకొని యున్నదని మరచిపోకండి!" అనేసరికి రామారావు నిర్విణ్ణుడయాడు. "సీతా నా మనస్సును నీవింకా పూర్తిగ గ్రహించలేదు. అదికాకపోయినా నీవలా నీజాగ్రత్తలో మాట్లాడటం నీవిధి. అది నీయొక్క పవిత్రగుణాల్ని, ఉన్నతాశయాల్ని తెల్పుతున్నై. కాని నీకిదే నేను ప్రమాణంచేసి చెబుతున్నా. మా వాళ్ళతో నాకెటువంటి సంబంధంలేదు. నా చదువు పూర్తికాగానే నేను యీ యింటి ఆస్థులతోను, వ్యవహారాలతోను సంబంధంకూడ వదులుకోగలను, నే నెచ్చటికి పోయినా నన్నెడిగేవారేలేరు. ఇంక నీకేం భయంచెప్పు?"

* * *

"అన్నయ్యా నువ్వు పార్కుకేనా వెళ్తావు?" అని అడిగింది షర్టు పేంటులోకి దోపుతు "టక్" చేస్తున్న రామారావుని చెల్లెలు విమల.

"అవునమ్మా! అలాగే వెళ్తాను".

"అయితే, యీ ఆరురూపాయిలు సీత అమ్మ లచ్చికి యిచ్చివేసి అలాగే వెళ్ళిపోమంది అమ్మ. ఎందుకంటే యింట్లో ఎవరూలేరట, సీతకు చాల అవసరమని అడిగిందట, వెళ్ళినప్పుడు తీసుకువెళ్లమంటే మరచిపోయిందట. అంచేత అమ్మ నిన్ను మరేమీ అనుకోవద్దని చెప్పమంది" అని గుక్కతిరక్కుండ చెబుతూంటే రామారావుకు నవ్వువచ్చింది. తనకు యిచ్చివేద్దామని వుద్దేశమున్నా, "దానికి అంత అవుసరంవుంటే అదే మళ్ళీవచ్చి తీసుకుంటాదిలే!" అన్నాడు. "అయితే అమ్మతో అలాగే చెబుతాను," అని తుర్రున పారిపోతున్న విమలను పట్టుకొని, 'చెప్పనక్కరలేదులే! దారిలోనేగా లచ్చి యిల్లు

యిచ్చివేస్తానని చెప్పమ్మా" అని ముద్దుపెట్టుకొని వదిలిపెట్టాడు. ఆసురూపాయల కాగితాలు టేబిలుమీద పెట్టి యింట్లోకి పారిపోయింది చిన్ని విమల. బాగా "టాయిలెట్"ఐ బయలుదేరాడు రామారావు, ఆశాసౌధాలను అంతరిక్షమార్గంలో నిర్మించుకుంటూ.

లచ్చి యిట్ల అందరి కూలివాళ్లలాగు కాకుండా ఒక మోస్తరుగ శుభ్రంగానే ఉంటుందని చెప్పాలి. సీత తనకు సాధ్యమైనంత వరకు యింటిని ఎంతైన నిండుగాను, పరిశుభ్రంగాను ఉంచుదామని ప్రయత్నిస్తుంది. సీత ఎంత చెబితే లచ్చి అంతే! తన ఆశలన్నీ తన ముద్దులపట్టి సీత మీదనే పెట్టుకుంది. సీత తాను, రామారావు కలుసుకున్నారని చెప్పక పోయినా, ప్రేమించుకున్నారని, పెళ్ళి చేసుకుంటామని వాగ్దానం చేసాడని తల్లితో చెప్పింది. కాని లచ్చి మొదట ఏదో భ్రమ అనుకున్నా, తన జ్ఞానసౌందరిని ఏరాజు చేపట్టక పోడు! అనుకుంది. తన కూతురుకన్న తన కేమీ హెచ్చు తెలియదని అంతరాత్మ బోధించింది.

సీత ఏదో పాత పుస్తకం తీసి పాత పడిన నులక మంచంమీద పడుకొని చదువుకుంటుంది. కాని తను రామారావుతో వూహించుకొన్న ఆశాలతలు ఆకాశ సౌధ పరిభాగములకు ప్రాకుతూ వుండుటచేత మధ్య మధ్య చదువుకు అంతరాయాలు కల్గుతూనే్న. వెంటనే లేచి కిటికీముందు నిలిచి అద్దంతీసి తన అపురూపమైన అందాన్ని చూచుకొని మురిసిపోయింది. మూడు, నాలుగు విధాలుగా ముఖాన్ని త్రిప్పి ఏ "పోజు" మిక్కిలి అందంగాను, ఆకర్షనీయంగాను వుందో చూచుకుంది. మళ్లీ మనస్సు కట్టుదిట్టం చేసుకొని మంచంమీద వెళ్లకితలా పండుకొని. తక్షణంగా చదువు ప్రారంభించింది. అంతట్లోనే మట్టి నేలమీద "తక్" "తక్" మని బూట్లచప్పుడు వినగానే, త్రుళ్లిపడి లేచి, చేతిలోని పుస్తకంతోనే మంచాన్నలా దులిపి కూర్చోమని సౌంజ్ఞ చేసింది రామారావుని. సాయంత్రానికి వంట తయారు చేయుటలో నిమగ్నురాలైయున్న లచ్చికూడ, "బాబు, మీరా! నాతండ్రి! పేదలంటే మా పెద్దదయ నా బంగారు తండ్రికి" అని ముసి ముసి ముసలినవ్వు నవ్వింది.

"మానవులై పుట్టింతరువాత అంతా వకటే లచ్చీ. మరి స్వాతంత్ర్యంవచ్చిన తరువాత గొప్ప, బీద, అన్న భావం నశించాలనేగా అందరు కృషిచేస్తున్నది. నువ్వు, నీ సీత కాకపోయినా, నీమనుమడో, సీత మనుమడో, ఈ గొప్ప, బీద తారతమ్యంలేని పరిస్థితిని తప్పక చూస్తాడు" అని రామారావు చిన్న చింకిలెక్చరుకొట్టి నులక మంచంమీద నిదానంగా కూర్చున్నాడు.

"అందరూ అలా సెప్పటమేకాని చేసినోరు ఓరూ అవుపించరు బాబు. యుద్ధంపోయి, సోతంత్రం వచ్చినా ఒక్కకష్టమేనా దిగజారనేదు బాబూ!"

"అదుగో మీరంతా పడుతున్న గొప్ప పొరపాటే అది. ఒకటిచెప్తాను చూడు. స్వాతంత్ర్యం వచ్చిందని పంటలు బాగా పండుతాయా? మిల్లులు, బడులు, ఆసుపత్రులు, వాటికవి ఒక్కసారి మొలుస్తాయా? తాపీగా ఒక్కొక్కటే వృద్ధిచేసిం తరువాత క్రమేనా మన కష్టాలుకూడ తగ్గుతాయ్. అంతేగాని, ఇన్నాళ్ళనుండి పెరిగి కూర్చున్న కష్టాలన్నీ ఒక్క సంవత్సరంలో ఎలా దిగజారుతాయో చెప్పు?"

"నా ముకం నేనేం సెప్తా బాబు - ఇంతకూ మీరొచ్చేపనేదో తెలిపేరుకారు!" అని లచ్చి అడగ్గానే "ఎలాగు పార్కుకు పోతానుగ, దారిలోనే వుంది నీయిల్లు అందుచేత సీత అడిగి పట్టుకెళ్లటం మరచిన జీతం రూపాయలు యిచ్చిపోదామని వచ్చా. అమ్మ నీకిచ్చీమని చెప్పింది. పాపం చాల జసుగురుగా వుందట నీకు?" అనేసరికి, "మా మారాజు, మీ రుణం ఎలాగు తీర్చుకొంటానో! ఎంత ఉదారంగల బాబులు!" అని పొంగిపోయింది లచ్చి. "ఈపాటి దానికంతే బ్రహ్మాండ మేముందిలే" అని రెండు పదుల కాగితాల్ని లచ్చి చేతిలో పెట్టాడు. "అమ్మో! ఇంత మొత్తం ఎందుకు బాబు?...అమ్మో! ఆరు రూపాయలకి యిరవయ్యే! ఎవర్ని చూచి ఎవరిస్తారు బాబు?" అని ముసిల్ది అంటుంటే, "నన్ను చూచి యిస్తున్నారేమో అడుగ" అని చిలకలా అందుకుంది అప్పటివరకు వూరుకున్న సీత. "నిన్నుచూచి యిస్తే, అబ్బే! ఇంత మొత్తమేనా? చాల పెద్ద మొత్తమే యిద్దును" అన్నాడు చమత్కారంగా రావు.

"పోనీయండి బాబు, ఎడ్డిబాగులపిల్ల, ఆ చిలిపిదాంతో మీకేంటి బాబు" అని నోట్లతో పొయ్యిదగ్గరకు పోయింది లచ్చి.

* * *

కాలం దొర్లిపోతుంది. వీలున్నప్పుడెల్లా రామారావు సీత సంతోషంగా గడిపేవారు. రావుకి మూడు నెలల సమ్మరు సెలవలు మూడువారాల్లా అనిపించింది. ఆఖరకు సీతను విడిచి వెళ్లటమే దుర్లభమనుకున్నాడు! కాని సీతే ధైర్యవచనాలు చెప్పేది, భావిజీవిత భాగ్యోదయానికి తాను నిర్వర్తింప వలసినది మరచి పోవద్దనేది. తన చదువే తనకూ, తన జీవిత పథానికి మూలాధారం కాగలదని చెప్పేది. ఆ మాటల్తో రావు తన మనస్సును కట్టుదిట్టం చేసికోగలిగాడు. ఆ శుభ సమయం రాగానే ప్రయాణమయ్యాడు. ఆ సమయానికి సీతకు దిగులు జాస్తీ అయింది. కన్నీటి బిందువులుకూడ కార్చింది. కాని అది విచారానికి సమయం కాదని వెంటనే ఆనంద భాష్పాలుగా మార్చుకుంది. తాను యింట్లోనే వుంటుంది కాబట్టి రామారావు క్షేమము ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని సంతృప్తి పడింది. రామారావు వెళ్లిపోయాడు. ఆ మూడు నెలలు జరిగినదంతా సినిమా చూచినట్లనిపించింది సీతకు.

రామారావు తండ్రి మాధవరావుకు తరచుగానే వుత్తరాలు వ్రాస్తున్నాడు. ప్రతి వుత్తరంలోను, "మన ఆవు, దూడ, సీత క్షేమముగానే వున్నారనుకుంటూ" అని వ్రాసేవాడు. రామారావు తల్లి రాధమ్మ అమాయకంగా, "సీత! మావాడు నిన్నుకూడా అడిగాడే" అనేది సీతతో. ఎవరైన వుత్తరం చదవటం చాటుగుండావింటే పొంగిపోయేది సీత! కొన్ని వుత్తరాల్లో "సీత ఆవును బాగా మేపుతుందనుకుంటాను!" "దూడను కూడ బాగానే ఆడిస్తుందనుకుంటా!" అని వ్రాసేవాడు అవన్నీ ఆలకించి మరీ పొంగిపోయేది సీత.

ఈ ఏడు అయిపోతే యింక శాశ్వతంగా ఉండవచ్చునని ధైర్యం వహించింది సీత. ఆ వత్సరంతో ఎలాగూ చదువు పూర్తికావస్తుందని మాధవరావు పెండ్లి ప్రయత్నం గట్టిగాచేస్తున్నాడు. చదువుతోపాటు పెండ్లి కూడ కడకు పూర్తిచేద్దామని. "నీకు మంచి సంబంధం చూస్తున్నాను. నీవు చదువు పూర్తిచేసింతరువాత వివాహంకూడ చేసుకుంటే నాబాధ్యత తీరినట్లవుతుందని" ఒకసారి కొడుక్కి రాసాడు. కాని "నా వివాహం నా హక్కు, అన్నివిషయాలూ నాకే వదలివేయండి, మీరేమీ శ్రమతీసుకోకండి" అన్న రామారావు జవాబు అత్యాశ్చర్యాన్ని కల్గించింది తండ్రికి. ఇంక వుత్తర ప్రత్యుత్తరాలతో అతని చదువు ఆటంకపరచడం ఇష్టంలేక ఆ విషయమే రాయటం మానివేసాడు మాధవరావు. కాని ప్రయత్నాలుమాత్రం జోరుగ చేస్తున్నాడు.

* * *

ఆవేళ మెయిల్లోదిగాడు రామారావు. రావు మరెక్కడకు వెళ్ళనవుసరంలేదని తల్లికూతుళ్లు సంపూర్ణానందాన్ని కనపర్చారు. కాని మాధవరావుమాత్రం ఏమీ కనపర్చలేక "న్యూట్రలు"గా ఉండిపోయాడు, రూములో బట్టలు విప్పుతున్నాడు రావు. మాధవరావు సోఫామీదకూర్చొని "పరీక్షలు బాగా రాసినట్టేనా?" అని అడిగాడు.

"బాగానే ఆన్సరుచేసా" నన్నాడు రావు.

"ఏదో తలపెట్టినందుకు పట్టుదలతో పూర్తిచేసావు. నా కోసం కాకపోయినా నీ, నీ పిల్లల భావికోసమే అనుకో! నా కోర్కెను మొత్తంమీద యిప్పటివరకు నెరవేర్చావ్!"

"కొడుకు పాటింపవలసిన విధి కొడుకు పాటించాడు—అంతే!"

"నిజమేలే! అందరూ నీలా ఉంటారా? లేక లేక కల్గినవాడవు నీవు. కల్గినది మీ చెల్లెలు. మీరు తప్పిస్తే నాకు మీ అమ్మకు యింకెవరున్నారు? మా తాతల,నాటినుండి యిప్పటివరకు వంశమర్యాదను నిలబెట్టుకొనుచూ గౌరవంగా బ్రతికాము. ఇంక నీ..."

"ఇప్పుడివన్నీ ఎందుకు నాన్నగారూ?" జోరుగానే అడిగాడు.

"అవుసరంలే దనుకో! చిన్నో, పెద్దో, తండ్రి చెప్ప వలసినవి చెబుతున్నాను. నీ వేదో ఎక్కడో చదువు కున్నావ్. మన పూర్వుల పుట్టు పూర్వోత్తరాలు, వంశ మర్యాదలు నీకెలా తెలుస్తాయ్?"

"అవి తెలియకపోవటం నిజమే. కాని ఈ ఆధునిక ప్రపంచంలో అవన్నీ అనవసరం! ఈ కాలంలో బాగా ఎఱుగుదును. ఇంకేం కావాలి నాన్నగారు?" అని తండ్రి వుద్దేశం గ్రహించినవాడై గట్టిగా చెప్పాడు.

"దానికేంలే! మీరు ఎఱిగున్నవి వేరు, మేం చెప్పేవి వేరు. దానికేంగాని, మనవీధి చివర ప్లీడరుగార్ని ఎఱుగుదువా?"

"గోపాలరావు పంతులుగారా?

"ఆఁ...ఆఁ...ఆయనే! చాల గౌరవ నీయుడు. కావలసినంత పలుకుబడివుంది. వారమ్మాయి కమలను ఎప్పుడైనా చూచావా"

"ఎప్పుడో చేన్నాళ్ళక్రితం చూచినట్లు జ్ఞాపకం. అయితే! వారికేమయిందీ?" ఆతురతతో అడిగాడు.

"ఇప్పటి కింకా నిశ్చయమయింది. ఆమెతో నీ కింక వివాహమవ్వాలి" అని చల్లగా అందించాడు మాధవుడు.

"నా వివాహం నాకే వదలివేయమని వ్రాసేనుగా!"

"ఇంక నీకే వదిలాను. ఆమెనుచూచి నచ్చినవేమో చెప్పు. లేకపోతే యింకొకరు."

"అలాక్కాదు నాన్నగారూ! నా వివాహమంతా నామీదే విడిచి పుచ్చండి. మీ రేమి శ్రమపడకండి. నాకిష్టమయినపుడు నేనే మీతో చెబుతాను."

"ఇందులో శ్రమేమీలేదే! తగినసంబంధం కూర్చటం తప్ప - ఆ గోపాలరావు గారి అమ్మాయిని చూస్తేమాత్రం నీవిట్లా మాట్లాడేవాడవుకావు. దానికితోడు ఐదువేలు కట్నం యిస్తానన్నాడు. లేకపోతే కారే కొనియిస్తా నన్నాడు. ఇంకేం కావాలి చెప్పు?"

"నాన్నగారు! ఇన్నెందుకు. నాకు ధనవంతుల సంబంధాలు యిష్టంలేదు. ధనంతోకూడ నిమిత్తంలేదు. మనకు భగవగంతు డిచ్చిందేదో కొంతవుంది. ఇంక ధనంకోసం ఆసించడం మూర్ఖతకూడాను. ధనవంతులు ధనవంతుల్నే చేసుకుంటే తక్కిన పేదసాదలు ఎన్నాళ్లు అలా అడుగంటి తిండానికి కూడులేకుండ వుంటారో ఆలోచించండి?"

"అవున్లే! నీవు చదువుకున్న వాడవు. నీకు ఆశయాలు హెచ్చుంటాయని నాకు తెలుసు. కాని బీదవారికి సహాయంచేసే విధాలు సహస్రమున్నాయ్! నీ కిష్టమయితే ధన సహాయం చేయవచ్చుగా! అంతేగాని మన కుటుంబంలోలేని నీచపద్ధతుల్ని తీసుకురాక!"

"నిజమే లెండి! కాని ధనసహాయం ఎవరైనా సరే ఎంతోకాలం చేయలేరు. చేసినవారికి పుచ్చుకున్నవారికి కూడ కష్టంగానే వుంటుంది! కాని యీ వివాహ మూలంగా ఆ రెండు కుటుంబాలకు శాశ్వతమైన అవినాభావ సంబంధ మేర్పడుతుంది. అటువంటప్పుడు రెండు పార్టీలకు ఏవగాని, ఆటంకంగాని వుండదు. ఆ విధంగా ఒక బీద కుటుంబాన్ని వృద్ధిలోనికి తీసుకొచ్చిన వాళ్ళ మవుతాము. ఈ విధంగా ధనవంతులంతా ఆదినుండి అనుసరించినట్లయితే, మన భారతదేశ మిపుడింత అధమ స్థితిలో ఉండేదేమో ఆలోచించండి? ఇటువంటి పవిత్రాశయాన్ని వుద్రేకంలో నీచంగా వుచ్చరించారు!" అని తీవ్రంగా మాట్లాడాడు రావు.

"దానికేం గాని! ఈ విషయం ఆ తరువాత మాట్లాడు కుందాం సావకాశంగా! ముందు నువ్వు స్నానంచేసి సాపాటు కాని" అని తండ్రి అనగానే రామారావు నిరానంద వదనంతో నీళ్ళగది దగ్గరకు పోయాడు. అంతే వరకు తలుపు చాటునుండి ఆలిస్తున్న విమల వంటింట్లో వున్న తల్లిదగ్గరకు తుర్రున పారిపోయింది విన్నదంతా చెప్పటానికే కాబోలు!

రావు నీళ్ళగదిలోనికి వెళ్లేసరికి సీత చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. కాంతి విహీనమైన ముఖంతో సీత ముఖాన్ని చూడలేక పోయాడు. తొందరగావచ్చి స్నానం చేద్దామని అనుకున్నాడు, కాని సీతవైపు చూడ లేకుండ వుండలేక పోయాడు. గబగబావచ్చి నుదుటను ముద్దాడి, పుష్పాశ్రువులను విడిచాడు. సీతకు అంతా అయోమయంగా వుంది. సంతత మందహాస ముఖార విందుడైన తన నవమన్మథమూర్తి విచారాశ్రువులు అర్థం చేసుకోలేకపోయింది! ఏదో ప్రయాణిక బడలిక అను కుంది మొదట—లేకపోతే తండ్రి ఏమైనా అన్నా

లేమో! అనుకుంది. అందుచేత, "ఇప్పుడు తాల్చినది అనురాగ భాష్పాలా? అనుమాన భాష్పాలా?" అడిగింది. రావు నిజంగా లేని చిరునవ్వును తెచ్చుకొని, "నీవే నిర్ణయించుకో సీతా! అవే భాష్పాలో కూడ చెప్పలేనంత అసమర్థత స్థితిలో వున్నా" నన్నాడు.

"ఏమైనా పరీక్షలు పాడుచేసారా?" చల్లటి ప్రశ్న.

"లేదు! నీనిర్మల నిత్యానంద సుందర ముఖపద్మాన్ని మనస్సులో నిలుపుకొంటూ, అత్యుత్సాహంతో పేపర్లన్నీ బాగా వ్రాసాను. నీ పరిచయ బలమువల్ల ఫస్టుక్లాసు వచ్చి తీరుతుంది" అని మధ్యవ్రేలుతో బుగ్గమీద కొట్టాడు.

పోనీలెండి! నన్నంత బాగా పొగిడినందుకు పరీక్ష ప్యాసవగానే మంచి బహుమానం ఏదైనా యిస్తారేండి!" నవ్వుతూ అంది సీత.

"ఇపుడన్నావుగాని, తరువాత మాట తిరుగవచ్చు. అందుచేత అడ్వాన్సు క్రింద యిది—అని అధరంమీద తీయటి ముద్దును తీసుకున్నాడు రావు. ఇలాగు నవ్వులతోను, నాటకాలతోను స్నానం ముగించి బయట పడ్డాడు. కాని తండ్రి మాటలు తలచుకుంటేసరికి గుండె జారుతున్నై! సీత కేదో తీరని ద్రోహం చేస్తున్నట్టే అనిపిస్తుంది రావుకి!

* * *

ఆ మరునాడు వుదయం రావు డ్రాయింగురూములో కూర్చొని పేపరు చూస్తున్నాడు. మాధవరావు అప్పుడే భోజనంచేసి వచ్చాడు.

"ఏం! రామం! కమలను చేసుకుంటానంటావా?" సమంజసంగా అడిగాడు.

"ఇష్టంలేదని చెప్పేగా నాన్నగారు!" సూటి జవాబు.

"రామం! నేను చెప్తున్నాను చూడు. ఇష్టం లేకపోవటం ఏమిటో నాకు తెలీకుండవుంది. అమ్మాయికి గాని, వాళ్ళ ఆస్థికిగాని ఏమీలోటులేదు. నీకొచదువు పూర్తిఅయింది, వయస్సుకూడ 23 కు తక్కువలేదు. అందులోను గోపాలరావంత గౌరవనీయుడు మన కెలుకులో లేరని నీకు తెలుసు. ఇంకేం కావాలి చెప్పు? ఇదుగో! నన్ను వేధించకు. వివాహం జీవితంలో ఎప్పుడైనా చేసుకోవలసిందే! నేను మీ అమ్మకూడ నీ మీదే ఆశపెట్టుకున్నాం. ఇంకో మూడేళ్ళలో మీ చెల్లెలు ఎక్కడుంటుందో మనం చెప్పలేం! మేమేమి చేసినా నీ కొఱకే! గోపాలరావుగారి అమ్మాయి నీకు అన్ని విధాలా తగినభార్య. కొంతవరకు చదువుకుంది కూడాను! ఇదుగో ముహూర్తం! నీ చదువుకు ఆటంకమని నేను నీ కేమీ రాయలేదు. ఎన్నోతంటాలుపడి ఆఖరకు అన్ని విధాలా అనుకూలమైన సంబంధమని నిర్ణయించాను.

"ఇంక వారం రోజులే ఉంది ముహూర్తం! ఇటువంటప్పుడు నాకిప్పుడే పెళ్ళి వద్దంటావ్. నీ కేమైనా ధర్మంగావుందా? చెప్పు? అందరు తండ్రుల్లాగు నేనేమీ పట్టుపట్టి "నీవీ పెళ్ళిచేసుకుంటే చేసుకో! లేకపోతే యింట్లోనుండిపో!!" అని చెప్పే తండ్రినిగాను. నీవు సులువుగా ఒప్పుకుంటా వనుకున్నాను. నీ కన్ని విధాల తగిన సంబంధం అని అనుకున్నాను. కాని నీవిలా ఎదురుచెప్తా వనుకోలేదు. పోనీ నీ ఎఱుకలో నీకిష్టమున్న అమ్మాయివుంటే చెప్పు, ఆమెనే చేసుకుందువుగాని" అని అతిదీనంగా కొడుకు గడ్డం పట్టుకున్నాడు మాధవుడు.

"నాన్నగారు! మీరింత విచారస్థితిలో నిస్పృహాయులవలే వుంటే నేనేం చెబుతానో చెప్పండి?"

"నా విచారానికి కారణం లేకపోలేదు రామం! గోపాలరావుతో అన్నిమాటలు జరిగాయి. నిన్నొప్పిస్తానని, నీవు తప్పకుండ ఒప్పుకుంటానని వారి సంబంధం నా బలవంతాన ఖాయపరచుకున్నాను. అటువంటి అన్ని విధాల తగిన సంబంధాన్ని నీవు వద్దంటే నా కెలా వుంటుందో ఆలోచించు?"

"నాన్నగారు! పోనీ ప్రస్తుతానికి నా వివాహాన్ని ఆపుచేయించండి! అంత తొందరపడే పరిస్థితులేమీ లేవు. నా కప్పుడే సంసారంమీద మనసులేదు కూడాను. ఇష్టం లేని సమయంలో వివాహ మెందుకని నా వుద్దేశం. నా కసలు సంసార గొడవంటేనే కిట్టదు!"

"అదుగో! ఎప్పుడో ఒకప్పుడు జరగవలసిందేగా! నిన్నింత వరకూ వుంచడమే తప్పుగా భావిస్తారు. నేను మీ అమ్మ వుంటుండగానే ఆ మూడుముళ్ళుపడితే చూచి

అనందిస్తాం. ఆతరువాత ఎవరుపోయినా పూచీ వుండదుగా!...మీ అమ్మని ముసలికాలం కొండంత కొడుకుండి చేదోడుగా కోడలులేకపోతే దాని మనస్సు ఎంత బాధాకరంగా ఉంటుందో చెప్పు?...ఇంతకీ అసలు విషయం ఏదో దాచి మాట్లాడకు రామం! నీ మనస్సులో వున్నదేదో చెప్పు".

"నాకు బీదవాళ్ళ సంబంధం చేసుకుందామని వుందని చెప్పానుగా!"

పోనీ! మనకులంలో మన ఎఱుకలో బీదవాళ్లు ఎవరున్నారు చెప్పు చూద్దాం?"

"మన కులం, మన శాఖవాళ్లతోనే సంబంధం చేసుకోవాలా నాన్నగారూ?"

"అదుగో, మళ్ళీ నువ్వు వంకదారి పడుతున్నావు! చదువుకున్న వాళ్ళకు ఆశయాలు హెచ్చుంటాయని నాకు తెలుసు. ఏదో విధవనో, మాలదాన్నో, లేకపోతే ఏ కాందిశీకునో చేసుకొని సంఘంలో బ్రహ్మాండమైన మార్పును తేద్దామని మీకు సహజంగా ఉంటుంది. ఆ ఆశయాలు ఆ అమ్మాయిలు నవరూప సౌందర్యవతులయిందాకేనని నేను వేరే చెప్పనక్కరలేదుకే! కాని ఈ కాలం యింకా అటువంటి స్థితికి రాలేదు. మేమున్నంతకాలం మీ ఆశయాలు సఫలీకృతంగావు. నీ ఆశయాలు అంత అవశ్యకమైనవయితే నీ పిల్లలవల్ల సులువుగా నెరవేర్చుకోగలవు. కాని యీ వున్న నాల్గు నాళ్ళు గౌరవంగా బ్రతకాలంటే ప్రస్తుతానికి నీ ఆశయాలు వదులుకోవాలి. అందరిలా నీ కెదురుచెప్పి నిన్నే యింట్లోనుండి పోయినట్టు చేయలేను. నీ మాటలు ఆలకిస్తుంటే నిజంగా మీ అమ్మ, నేను ఏ కాశీవో, రామేశ్వరమో పోదామని అనిపిస్తుంది. ఇదుగో మనస్ఫూర్తిగా చెబుతున్నాను. నా మాట మన్నించి అందరిలో నా గౌరవం కాపాడదలచినా నువ్వే! ఉన్నదేదో శూన్యం చేయదలచినా నీవే!" అని మాధవరావు బొలబొలమని ఏడ్వటం ప్రారంభించాడు చిన్నవానిలా! అది చూచి రావు నిశ్చేష్టుడయాడు. వెంటనే అతనిలో గొప్ప మార్పేదో వచ్చినట్టు గ్రహించాడు. ఇంతవరకు కొడుకుల్ని తండ్రులు ఏడిపించడం అతనెఱుగును. కాని తండ్రినే కన్నీరు కార్పింపజేసిన కుమారుడు తానొక్కడే అనిపించింది. తనకు ఆశయాలు ఉంటే తనకు పుట్టిన వాళ్ల చేత నిర్వర్తింప జేసుకోవాలి! తన్ను పెంచి, ఇంత విద్యనేర్పించి, తన కాలంలో ధనాన్ని పోగుచేసి వుంచిన తండ్రిని ధిక్కరించడానికి తానెవరు? అతని మనస్సు ఎంతో పరితపించకపోతే కుమారుని ముందు అలా ఏడుస్తారా? తాను నిజంగా మూర్ఖుడే! అనిపించింది రావుకు.

వెంటనే లేచాడు. సోఫామీద కూర్చొని కన్నీరు కారుస్తున్న తండ్రివద్దకువెళ్ళి రుమాలుతో కన్నీటిని వత్తుతు "నాన్నగారు! మీరిలా విచారించటం అసహజం! ఏమీ బాగులేదుకూడాను! నా కిప్పుడంతా అర్థమయింది. పెళ్ళికి ఏర్పాట్లన్నీ చేయించండి——నేను వప్పుకున్నట్టే." అనేసరికి తండ్రి ఆనంద బాష్పాలతో కుమారుని ఆలింగనం చేసుకున్నాడు. రావుకి ఎంతో సంతోషమనిపించిందా ఆలింగనం!

పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయ్. కాని రావుకు రోజు రోజుకు దిగులుతో మనస్సాంద్రత హెచ్చుతూ ఉంది. తానెవరినో హత్యచేయబోతున్నట్టనిపించింది. తానీ వివాహం చేసుకుంటే సీత హత్య చేసుకుంటుందా?——అంతరాత్మను వేయవలసిన మొదటి ప్రశ్న రామారావు కది. సీత పవిత్ర హృదయాన్ని విపులంగా ఎఱుగున్న 'రామారావా ప్రశ్న వేయటం వట్టి తెలివితక్కువని చెబుతుందతని అంతరాత్మ. సీతతో కలసి "Elope" అయితే?...తల్లిదండ్రులు యింకేమనా బ్రతుకుతారా? అని తిరుగు ప్రశ్న వేస్తుంది అంతరాత్మ. తల్లిదండ్రులులేని తరువాత తాను బ్రతికే దెవరికోసం? ఇంట్లోనే వుండటానికి నిశ్చయించుకున్నాడు.

* * *

పెళ్ళి దగ్గరపడుతున్న కొద్దీ సీతకు ఆలోచన, ఆవేదన జాస్తీ అవుతున్నాయ్. రామారావును కలుసుకోటానికి వీలుచిక్కకుండ వుంది. ఇద్దరూకూడ ఒకసారి కలుసుకొని ఎవరి హృదయవేదన వారు చెప్పుకొని హృదయభారం తీర్చుకుందామని అనుకుంటున్నారు. కాని ఎవ్వరికి అవకాశం చిక్కలేదు. రామారావు స్నానంచేస్తున్నప్పుడు ప్రత్యేకంగా చెల్లెలు విమలదగ్గిర వుండి చేయిస్తుంది. పోనీ ఏమైనా సౌంజ్ఞ చేస్తాడేమో అని సీత అతను కనపడినపుడు చూచేది. కాని తల దించుకునే తిరిగేవాడు. రామారావుకూడ సీతను కలుసుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. కాని ఎచ్చట

చూచినా బంధుకోటితో యిల్లంతా నిండివుంది. అందుచే యిద్దరూకూడ నిరాశాపూరితులయారు.

ఇంకా రెండుదినాలు వుంది పెళ్ళి. ఆవేళ రామారావు పడుకొని 6 గంటలకు లేచాడు. అప్పుడే చిన్న చీకటి పడుతున్నట్టుంది. కాని లేవగానే చెల్లెలు దగ్గరకు రాలేదు. ఇంట్లోవారంతా ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇదే సమయమని చప్పున నీళ్లగదిదగ్గరకు వెళ్లాడు. సీత పనులన్నీ ముగించుకొని బయటకు వస్తూవుంది. "సీతా!" అన్నాడు అది దీనంగా. దగ్గరకు రాగానే బోలున ఏడ్చాడు. సీతకేమీ అర్థమవలేదు! అతనంటె తన సంతాపాన్ని పైకి వెలిబుచ్చాడు కాని, ఈ వారం రోజులనుండి కుళ్ళి కుళ్ళి దుఃఖిస్తూన్న ఆమె అంతరాత్మ రామారావుకేం తెలుసు! పైటచెంగుతో మృదువుగా కన్నీటిని వత్తింది. పెళ్ళిబొట్టుతో రామారావు ముఖం నిండుగ ఏడుపులోకూడ ఎంతో అందంగా కనిపించింది సీతకు. రామారావు తన్ను దగ్గరకు తీసుకోవటం గ్రహించి, ఆముద్దుల ముఖాన్ని తనివితీర ముద్దుపెట్టుకొంది సీత. ఆఖరిసారి అనుకుంది కాబోలు పాపం! అంతట్లోనే "అన్నయ్యా! నువ్వప్పుడే లేచావా? అన్న విమలగొంతు వినపడగానే వదలలేక వదలింది రామారావును పాపం! రామారావుకూడ ఆమెను విడువలేక విడుస్తు "మా నాన్నే కారణం" అనగలిగాడు. అంతే! అప్పటినుండి మరి సీతను కలుసుకో వీలయింది కాదు!

ఆవేళే పెళ్ళిదినము. ఇల్లంతా వైభవంగా అలంకరించివుంది. కాని రామారావులో యింకా ఆనంద రేఖలు ఉదయించలేదు. మోము పూర్తిగా క్షీణించింది. ఇరువదినాలుగు గంటలు తన గదిలోనే గడిపేవాడు. 8 రోజుల క్రితంనుండి వీధిలోకి రావటం మానివేసాడు. ఆరోజు వేకువజామునే రామారావును లేపి మంగళస్నానం చేయించారు. గదిలో కూర్చుండబెట్టారు. 10 గంటలకు ముహూర్తకాలం. అప్పటికి ఎనిమిది గంటలయింది. ఆరుగంటలకే రమ్మన్న సీత యింకా రాలేదని తల్లి, రాధమ్మ ఎదురుచూస్తూ వుంది. నిన్ననే యిచ్చిన కొత్తకోక కట్టుకొని వస్తాదేమో అని అనుకుంది. కాని యింకను రాకపోవటానికి కారణం తెలుసుకుందామని ప్రక్కింటి పనిమనిషి అచ్చమ్మను, "మా సీత పెళ్ళికి బాగా ముస్తాబై వస్తూవుందా, ఏం వచ్చీ?" అని పెరట్లోంచి అడిగింది. "ఇంకేం ముస్తాబమ్మా! దాని ముస్తాబంతా తెల్లవారుజామున నూతిలో పడి ముక్కలు చేసుకుంది!" అని చెప్పలేక అతి దీనంగా చెప్పింది అచ్చమ్మ. "అయ్యో" అంటే "అయ్యో" అని యిల్లంతా ఘొల్లుమంది. ఈ వార్త వినగానే రామారావుకు వళ్లంతా ముచ్చమటలు పోసాయి. "సీత! నీకు మంచి భావివుంది" అన్న మాటలు హృదయాన్ని కలచివేస్తున్నాయ్! అలాగే మంచం మీదకు వాలిపోయాడు. "ఇటువంటి శుభసమయంలో అటువంటి అశుభప్రస్తాపన ఎందుకూ!" అని మందలించాడు యింటిపెద్ద. అందరు వర్షం వెలిచినట్టు వూరుకున్నారు. పనిమనిషికోసం పెళ్ళి ఆపుచేస్తారా? అంతా గొడవగానేఉంది. తీరా సమయానికి పెళ్ళికొడుకును తోడ్కొని తెద్దామని గదిలోకిపోతే, రామారావు ఉష్ణంతో కాలుతున్నట్లు చూచి చకితులయారు. అందరిముఖాలు కళావిహీన మయాయి. డాక్టర్ను వెంటనే పిలిపించాడు. జ్వరం చాల తీవ్రంగా వుందని చెప్పాడు. సూదులు పొడిచాడు! లాభంలేకపోయింది! పెళ్ళి అవవలసిన 10 గంటలకు రామారావు మృతుడయ్యాడు!!! ఆ నిముషంలో యింటినిండ అమావాశ్య చీకట్లు చొచ్చుకున్నై. ఏమూల చూచిన ఏడుపు మొఱలే! కొడుక్కి కర్మ చేయవలసిన కర్మం తప్పింది కొడుతండ్రికి. స్మశాన వాటికకు చేరుకున్నాడు శవంతో మాధవరావు. అంతకుముందే వచ్చివుంది సీత శవము. సీత శవాన్ని చూచాడు మాధవుడు కన్నీరులోంచి— పచ్చబద్దలుమీద పరచివుంది! తన కొడుకు శవాన్ని చూచాడు—అలానే పరచివుంది! వానిమీద ఖరీదైన పట్టువస్త్రాన్ని కప్పారు. ఆమె మీదకూడా కప్పివుండటం చూచాడు. సీతను దహనం చేయడానికి చూస్తున్నారు అక్కడి వారంత! పదిగజాల దూరంలో తన కుమారుని కూడ దహనం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు తనవారంత!! అయితే తన కొడుక్కి పనిమనిషి సీతకు వున్న తేడా ఏమిటి? దహనం అయింతరువాత అవవలసింది యిద్దరూ బూడిదే! అయితే తనకున్న ధనము, గౌరవం, మర్యాద, అధికృత ఏమిచేయగల్గాయ్? తన కుమారుణైనా బ్రతికించగల్గాయా?? అంతా శూన్యంగా కనబడింది! తన రామం తన్ను ఎదుర్కొని అన్నమాటలన్నీ చెవిలో యింకా గింగిరుమంటున్నాయ్!